ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 26 సెప్టెంబరు 2025 | 3





భారత్ పెట్రోలియం ప్రతినిధుల నుంచి ఒప్పంద పత్రాలు తీసుకున్న కలెక్టర్

జిల్లాలో రూ.3.41 కోట్లతో క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు

కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడి

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును అందుబాటులోకి తీసుకొస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సీఎస్ఆర్ నిధులు రూ.3.41 కోట్లతో అత్యాధునిక సదుపాయాలు, అధునాతన వైద్య పరికరాలతో కూడిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సును కాకినాడ జిల్లాకు ఇచ్చేందుకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. గురువారం ఆ సంస్థ ప్రతినిధులు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడంలో ముఖ్యమైన ముందడుగు పడిందన్నారు. ఈ బస్సు మూడు నెలల్లో జిల్లాకు చేరనుందన్నారు. బీపీసీఎల్ ప్రతినిధులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీపీసీఎల్ టెరిటరీ మేనేజరు బి.సురేష్, సీపీవో త్రినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీణాపాణిగా బాలాత్రిపురసుందరి

కాకినాడ సిటీ, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో నాలుగో రోజైన గురువారం నగరంలోని సూర్యారావుపేటలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బాలాత్రిపురసుందరి అమ్మ వారు వీణాపాణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నవావరణాచర్చన, చండీహోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా నాళం శ్రీదేవి బృందం వినాయక గానామృతం, మంజీర నాట్యాలయ విద్యార్థుల కూచిపూడి నృత్యం, శ్రీనివాస అన్నమాచార్య భజన కోలాట సేవా సంఘం సభ్యుల కోలాటం ఆకట్టుకున్నాయి.





(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

తుని-దివాన్‌చెరువు మధ్య ఆరులేన్లుగా హైవే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణించే చెన్నై-కోల్‌కతా 16వ నెంబరు జాతీయ రహదారికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయి. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తోన్న ఆరు వరుసల హైవే విస్తరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుత నాలుగు లేన్ల హైవే అత్యంత రద్దీగా మారడం.. బ్లాక్‌స్పాట్‌లు అధికమై తరచూ ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఆరులైన్లకు విస్తరించేందుకు ఎన్‌హెచ్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు హైవే విస్తరణకు సంబంధించి తాజాగా డీపీఆర్ సిద్ధమైంది. కాకినాడ జిల్లా తుని పట్టణం నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరం సమీపంలోని దివాన్‌చెరువు జంక్షన్ వరకు మొత్తం 91 కి.మీ. మేర విస్తరణకు అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. విస్తరణ ప్రాజెక్టులో ఆప్షన్1 అలైన్‌మెంట్ ఖర్చు రూ.2,500 కోట్లు అవుతుండగా.. ఆప్షన్ 4 కింద ఖర్చు రూ. 6,230 కోట్ల వరకు వ్యయం కానుంది. విస్తరణకు సంబంధించి 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు నిర్మించనున్నారు. అయితే హైవే వెంబడి అనేక గ్రామాలు ఉన్నందున కొన్నిచోట్ల బైపాస్ ప్రతిపాదించారు. ప్రాజెక్టు వ్యయం ఎక్కువే అయినా నాలుగో ఆప్షన్‌కే అధికారులు మొగ్గుచూపుతున్నారు. దీన్ని కేంద్రం పరిశీలించి ఆమోదించిన తర్వాత విస్తరణ పనులకు టెండర్లు పిలవనున్నారు.

ఆరు లేన్లకు ఇదే కారణం..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా ప్రయాణించే చెన్నై- కోల్‌కతా 16వ నెంబరు జాతీయరహదారి నిర్మించి దాదాపు పాతికేళ్లపైనే అవుతోంది. ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల హైవే పూర్తిగా రద్దీగా మారిపోయింది. రహదారిని నిర్మించినప్పుడు అంచనా వేసిన పీక్ ట్రాఫిక్ స్థాయి దాటి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. తుని నుంచి దివాన్‌చెరువు వరకు ఉన్న హైవే పరిధిలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్‌స్పాట్‌ల సంఖ్య విపరీతంగా పెరిగిపో యింది.ఈ నేపథ్యంలో ప్రస్తుత హైవేను ఆరులేన్లుగా విస్తరించాలనే ప్రతిపాదన ఎన్నో ఏళ్లగా ఉంది. అయితే నాలుగు లైన్ల వెంబడి తుని నుంచి దివాన్‌చెరువు వరకు అనేక గ్రామాలు,పట్టణాలు విస్తరించి భారీ వాణిజ్య భవనాలు వెలిశాయి. దీంతో ఆరు లేన్లను ఎలా విస్తరించాలనే దానిపై అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేసే బాధ్యత ఆర్కిటెక్నో, ధృవ్ కన్సల్టెన్సీలకు అప్పగించింది.

హైవే విస్తరణ ఇలా..

విస్తరణకు సంబంధించి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు,ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం, గండేపల్లి మండలాల పరిధిలోని తుని, చేపూరు, తేటగుంట, అరెంపూడి, పీఈ చిన్నయ్యపాలెం, సీతాయంపేట, ప్రత్తిపాడు, జగపతినగరం, సోమవరం, బూరుగుపూడి, రామవరం, రాగం పేట,తాళ్లూరు, బొర్రంపాలెం, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, కల్వచర్ల, రాజానగరం, జగన్నాథపురం, వెంకటపురం, నరేంద్రపురం, వెలుగు బంద గ్రామాల మీదుగా కొత్త లేన్ల వరుస నిర్మాణం జరగనుంది. కాకినాడ జిల్లా పరిధిలో తాండవ నది, అన్నవరం బైపాస్, ఎర్ర కాలువ వద్ద మూడు బ్రిడ్జిలు ప్రతిపాదించారు. తుని పరిధిలోని తిమ్మాపురంలో రైల్వే లైన్ నేపథ్యంలో ఆర్వోబీ ప్రతిపాదించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కాకినాడ ఏడీబీ రోడ్డు, కోరుకొండ, రాజానగరంతో పాటు కాకినాడ జిల్లాలో 11 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు గుర్తించారు. కాకినాడ జిల్లా పరిధిలో చేపూరు, ఎర్రవరం, బూరుగుపూడి, రామవరం, తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి తదితర చోట్ల 8 ఫ్లయ్ ఓవర్లు నిర్మించాల్సి ఉంటుందని ప్రతిపాదించారు. తేటగుంట, దివాన్‌చెరువు పరిధిలో మూడు కిలోమీటర్ల మేర రిజర్వు ఫారెస్ట్ మీదుగా రహదారి నిర్మించాల్సి ఉంటుందని గుర్తించారు.

- ప్రస్తుతం నాలుగు లేన్లు
- ఆరులైన్లుగా డీపీఆర్ సిద్ధం
- 4 రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు
- కాకినాడ జిల్లాలో 80 కి.మీ
- తూ.గో. జిల్లాలో 11 కి.మీ
- వ్యయం రూ.6,230 కోట్లు
- 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు
- 3 చోట్ల బ్రిడ్జిలు
- 14 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు
- త్వరలో కేంద్రం టెండర్లు

దాదాపు రెండున్నరేళ్ల ఈ సంస్థలు అధ్యయనం చేసి ఎట్టకేలకు నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లతో డీపీఆర్ సిద్ధం చేశాయి. కాకినాడ జిల్లాలో 80 కిలోమీటర్లు, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 11 కి.మీ.మేర ఆరులైన్ల విస్తరణ పనులు చేపట్టాలంటే ఒక్కో ఆప్షన్ కింద ఎంత వ్యయం అవుతుందో నివేదికలో విశ్లేషించాయి.

4 ఆప్షన్‌కే మొగ్గు..

ఆరులైన్ల విస్తరణకు సంబంధించి డీపీఆర్ నివేదికలో నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు విశ్లేషించారు. ఆప్షన్ 1 ఎంచుకుంటే ఆరులైన్ల విస్తరణకు ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారుగా రూ.2,300 కోట్లు,ఆప్షన్ 2 కింద రూ.4,200 కోట్లు, ఆప్షన్ 3 కింద రూ.6,700 కోట్లు, ఆప్షన్ 4 కింద రూ.6,230 కోట్లు వ్యయం కానున్నట్లు గుర్తించారు.అనకాపల్లి నుంచి దివాన్‌చెరువు కింద 160 కిలో మీటర్ల మేర ఆరు లైన్ల విస్తరణ ఖర్చు ఆప్షన్ 4 అలైన్‌మెంట్‌కు రూ.10,233 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా . ఆప్షన్1 కింద రూ.4,586 కోట్లు, ఆప్షన్2 కింద రూ.7577 కోట్లు, ఆప్షన్ 3 రూ.10,760 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. అధికారులు నాలుగో ఆప్షన్‌కే మొగ్గు చూపుతున్నారు. దీన్ని ఎంపిక చేస్తే ఇబ్బందుల్లేకుండా ప్రాజెక్టు పట్టాలెక్కించవచ్చని భావిస్తున్నారు. అలైన్‌మెంట్ ఆప్షన్లపై స్టేక్ హోల్డర్ల సమావేశాల్లో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీని ప్రకారం కేంద్రానికి ఎన్‌హెచ్ అధికారులు నివేదిక పంపుతారు. దీన్ని పరిశీలించిన తర్వాత కేంద్రం ఏ అలైన్‌మెంట్‌కు ఆమోదముద్ర వేస్తుందనేది చూడాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసుకుని హైవే విస్తరణకు టెండర్లు పిలవడానికి మరికొంత సమయం పట్టనుంది.



గొల్లప్రోలులో వీధి వ్యాపారస్తులకు నిర్వహించిన లోక కల్యాణ్ మేళాలో మాట్లాడుతున్న ప్రియంవద

రుణాలు చెల్లిస్తే బ్యాంకులే ముందుకు వస్తాయి

మెప్మా పీడీ ప్రియంవద

గొల్లప్రోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యాపారాల నిర్వహణ, అభివృద్ధికి తీసుకునే రుణాలను సకాలంలో చెలిస్తే బ్యాంకర్లే ముందుకు వచ్చి మరింతగా రుణాలు ఇస్తారని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద అన్నారు. గొల్లప్రోలులో వీధి వ్యాపారస్తులకు గురువారం లోక్ కల్యాణ్ మేళా నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనరు ఎన్.కనకారావు, జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ రవిశంకర్, టీపీఆర్వో భారతిలక్ష్మి, సిటీ మిషన్ మేనేజరు శ్రీదేవి, కౌన్సిలర్ భవాని, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యకమ్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకేలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక భూమిక పోషించే వైద్య సహచరుడే ఫార్మసిస్ట్ అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ, కె.పద్మప్రియ, బి.భవానీ, ఔషధ పరిశ్రమల ప్రతినిధులు కృష్ణారావు, సుధీర్ వర్మ, శ్రీతరుణ్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



లాయర్ల నిరసన

న్యాయవాదులకు ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటుచేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెద్దాపురం బార్ అసోసియేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిమెళ్ల భాస్కరాచార్యులు, పెద్దాపురం యూనిట్ నాయకులు ఎస్‌కే వల్లిబాబు, గణేష్, న్యాయవాదులు వెంకటరాయుడు, దొరబ్బాయి, డీకే జైన్, శ్రీనివాస్ పాల్గొన్నారు. **- పెద్దాపురం**





కాకినాడ కలెక్టరేట్ వద్ద స్వచ్ఛత హి సేవ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్.. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

స్వచ్ఛత హి సేవ ర్యాలీలో కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథ్ నినాదంతో జిల్లావాసులందరూ స్వచ్ఛత హి సేవ స్ఫూర్తితో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాలు, ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్దఎత్తున స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మన ఇంటితో పాటు పనిచేసే కార్యాలయాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడం ఎంతో ముఖ్యమన్నారు. తద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ కాకినాడ సాధనకు ప్రతి ఒక్కరు బాధ్యతతో కృషి చేయాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు కూడా నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, శిక్షణా కలెక్టర్ మనీషా, డీఆర్వో వెంకట్రావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవుల నాయక్, సీపీవో త్రినాథ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు, శివరామ్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో శ్రమదానం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. రమణయ్యపేట గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆధ్వర్యంలో ఆయన ఎస్ఆర్ఎంటీ గెస్ట్‌హౌస్ నుంచి సర్పవరం కూడలి వరకు అధికారులు, గ్రామస్తులతో కలసి శ్రమదానం చేసి రోడ్ల పక్కన ఉన్న ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాలను తొలగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డంపింగ్ యార్డు పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఎంపీడీవో పసుపులేటి సతీష్, డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఆర్ అంజనేయులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలకు చొరవ చూపాలి.. అసెంబ్లీలో దివ్య



తుని రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన వంతెనలను తొలగించి, వాటి స్థానంలో కొత్త వంతెనలను నిర్మించేందుకు చొరవ చూపాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అసెంబ్లీలో విజప్తి చేశారు. శిథిలావస్థకు చేరిన తిమ్మాపురం, కె.మల్లవరం ప్రధాన వంతెనల పరిస్థితులను సభలో వివరించారు. వీటి నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు.

బాబోయ్ బంతి!

- కిలో రూ.8
- రైతుల లబోదిబో



సామర్లకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బంతిపూల ధర పతనమైంది. మార్కెట్‌లో కిలో బంతిపూలు రూ.8 లోపు మాత్రమే ఉంది. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు.ఆగస్టు నుంచి జనవరి వరకూ బంతిపూల ధరలు బాగుంటాయని సామర్లకోట ఏడీబీ రోడ్డు మొదలుకుని పెద్దాపురం, రంగంపేట, గండేపల్లి, మండలాలకు చెందిన పలు గ్రామాల్లో బంతిపూల సాగు చేస్తారు. ప్రస్తుతం కోతకూలి,రవాణా ఖర్చులు సైతం రాక తోటల్లో కోతకు వచ్చిన బంతి పూలను కోయకుండా వదిలేస్తున్నారు. మార్కెట్లో అడిగేవారు లేక కొందరు రైతులు పూలు కోసి తోటల్లో గుట్టలుగా పోస్తున్నారు. సామర్లకోట-రాజానగరం ఏడీబీ రోడ్డు వెంబడి సుమారు 35 ఎకరాల్లో ఎకరాకు రూ. 60 వేల నుంచి రూ. 70 వేలు ఖర్చు చేసి బంతిపూల సాగు చేశారు. ఈ ఏడాది పైరుకు తెగుళ్ళు ఎక్కువగా ఆశించడంతో పురుగుమందులకు భారీగానే ఖర్చు చేశారు. వినాయక చవితి సమయంలో కిలో బంతిపూలు రూ. 50 నుంచి రూ. 60 వరకూ పలికింది. ఆ సమయంలో పెద్దగా పూల దిగుబడి లేదు. ఈ ధర మార్కెట్లో కొంత కాలం కొనసాగితే నాలుగు రూపాయలు చేతికి వస్తాయని రైతులు ఎంతో ఆశపడ్డారు. చవితి అనంతరం మార్కెట్లో పూలధరలు పత నమయ్యాయి. అదే సమయంలో తోటలలో పూల దిగుబడి కూడా పెరిగింది.బంతిపూలు సాగుచేసి నష్టపోయామని సూరంపాలెంనకు చెందిన మూడెకరాల బంతిపూల సాగుదారుడు బత్తుల శ్రీను వాపోయాడు.

వైభవోపేతం...మహాశక్తి యాగం

40 కోట్లకు చేరిన లలితా సహస్ర కుంకుమార్చన

పాల్గొన్న 15 వేలమంది భక్తులు



సామూహిక లలితా సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం వైభవోపేతంగా సాగుతోంది. గురువారం మూడు పర్యాయాలు పఠించిన లలితా సహస్రనామ పారాయణలో సుమారు 15 వేలమంది భక్తులు పాల్గొన్నారు. ప్రముఖ విద్వాంసుడు నాగరాజు వేణుగానంతో అమ్మను స్తూతిస్తూ భక్తులను పులకింపచేశారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. నాలుగు రోజుల్లో 40 కోట్ల లలితాసహస్రనామ కుంకుమార్చన పూర్తయ్యిందన్నారు. అయోధ్య నుంచి బాలరాముడు, బంగారు ధనుస్సు, ఐదు కలశాలను ఇక్కడకు తీసుకువస్తున్నారని, శుక్రవారం వీటిని భక్తులు తిలకించే అవకాశాన్ని అమ్మ కల్పిస్తోందన్నారు. ఈనెల 29న త్రికోటి మహాసరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. మూడేళ్ల బాలుడు హాన్సిదేవ్ ఆలపించిన హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామ పారాయణ ఆకట్టుకున్నాయి. సుమారు 30వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం రుత్వికుల ఆధ్వర్యంలో అమ్మవారికి గాయత్రి సౌర, అన్నసూక్త అన్నపూర్ణ హోమం, సహస్ర చండీ, సహస్ర రుద్ర, బగళాముఖి, వారాహి, పత్యంగిరా, వటుక, బైరవ హోమాలను పలు రకాల విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అనంతలక్ష్మి పాల్గొన్నారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్ సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

విజయవాడ దుర్గమ్మకు అన్నవరం దేవస్థానం సారె



విజయవాడ దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న అన్నవరం ఈవో, ఇతర అధికారులు

అన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మకు అన్నవరం దేవస్థానం తరుపున గురువారం ఈవో సుబ్బారావు, దేవస్థానం ప్రధానార్చకులు, ఇతర అధికారులు పట్టువస్త్రాలు, సారెను సమర్పించారు. ఏటా దసరా ఉత్సవాల్లో అమ్మవారి సోదరుడిగా సత్యదేవుడి తరుపున పట్టువస్త్రాలు అందించడం, స్వామివారి వార్షిక కల్యాణాలకు విజయవాడ దేవస్థానం నుంచి అన్నవరం దేవస్థానానికి పట్టువస్త్రాలు తీసుకురావడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం అధికారులకు విజయవాడ దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈవో వెంట ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఏఈవో భాస్కర్, సూపరింటెండెంట్ రామకృష్ణ, అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, ఏపీఆర్వో గణపతి తదితరులున్నారు.

శారదాదేవిగా రత్నగిరి దుర్గలు

అన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాల్గోరోజైన గురువారం రత్నగిరి దుర్గలైన వనదుర్గ, కనకదుర్గలు శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు రుత్విక్‌లు నిర్వహించారు.



శారదాదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గ

సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా మధు



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి సభ్యుడిగా తూర్పుగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న తాటిపాక మధు ఎన్నికయ్యారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకూ చండీఘడ్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభల సందర్భంగా గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శ డి.రాజా నూతన జాతీయ సమితిని ప్రతిపాదించగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తాటిపాక మధును జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మధుకు పలు ప్రజాసంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్న సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు అనేక భూ పోరాటాలు చేశామని, జాతీయ సమితి సభ్యుడిగా తాను ఎన్నిక కావడం మరింత బాధ్యతను పెంచిందని ఈ సందర్భంగా మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గోవులను వధించి నూనె తయారీ

- తునిలో పోలీసుల దాడులు
- నలుగురి అరెస్టు
- గో మాంసం, ఆయిల్ స్వాధీనం



తునిలో గో మాంసం నుంచి తీసిన కొవ్వు పదార్థాలు, గో మాంసం నిల్వలు

తుని రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దారుణం వెలుగుచూసింది. పవిత్రమైన గోవులను వధించే ముఠా గుట్టురట్టు అయింది. తుని కేంద్రంగా కొన్నేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారంపై పోలీసులు దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తుని సీఐ గీతా రామకృష్ణ బృందం పట్టణ శివారు రామకృష్ణా కాలనీలో గురువారం ఆకస్మిక దాడులు చేశారు. అదే ప్రాంతంలో తాండవ నదీ తీరాన ఆనుకుని ఒక ఇంట్లో గోవులను దాచిపెట్టి వధించి ఆయిల్ తయారు చేస్తున్నట్టు గుర్తించారు. గో మాంసంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గీతారామకృష్ణ మాట్లాడుతూ ఇదే ప్రాంతంలో 2023లో గో మాంసం ఆయిల్ తయారీపై దాడి చేయగా ఇదే రీతిన గో మాంసం, ఆయిల్ పట్టుబడిందని కేసు నమోదు చేశామన్నారు. అదే వ్యక్తులు ఇప్పుడు ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్టు తెలిసిందన్నారు. స్థానిక వీఆర్వో, వెటర్నరీ డిపార్టుమెంట్‌తో కలిసి దాడులు చేశామని. 8 టిన్నుల్లో గో మాంసం నుంచి తీసిన నూనెలు, గో మాంసం సీఐ పట్టుపడిందని తెలిపారు. మహ్మద్ సంసరే, మహ్మద్ హరీఫ్, మహ్మర్ ఇరీస్, బానేపల్లి మహేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి.. వృద్ధురాలిని కొట్టి..

15 కాసుల బంగారం, రూ.50వేల నగదు దోచుకున్న నలుగురు దుండగులు

రెండు మోటార్‌సైకిళ్లను సైతం దొంగిలించి వాటిపై పరారీ

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఘటన



బీరువాలోని దుస్తులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు



గాయపడిన వృద్ధురాలు

నల్లజర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ ఇంటి తలుపులు పగలగొట్టి ప్రవేశించి నిద్రిస్తున్న ఒంటరి వృద్ధురాలిపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవిదిద్దులు, బీరువాలో ఉన్న 4 గాజులు మొత్తం 15 కాసుల బంగారుం, రూ.50 వేల నగదు దోచుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లజర్ల సెంటర్‌లో వృద్ధురాలు పాకలపాటి సుభద్ర ఒంటరిగా నివాసం ఉంటుంది. కుమారుడు రమేష్ తల్లికి పగలు సేవలందించి రాత్రి అదే గ్రామంలోని అత్తగారింటికి వెళ్లి నిద్రిస్తాడు. ఇది గమనించిన దుండగులు బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు నలుగురి ముసుగులు ధరించి ముందుగా ఇంటి తలుపుకొట్టారు. తీయకపోవడంతో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవిదిద్దులు తీసుకుని బీరువా తాళాలు ఎక్కడున్నాయని ఆమెపై రాళ్లతో దాడి చేశారు. ఆమె గాయాలు భరించలేక బీరువా తాళాలు ఇచ్చేసింది. బీరువాలో ఉన్న 4బంగారు గాజులు, రూ.50 వేల నగదు దోచుకున్నారు. భయంతో వృద్ధురాలు బిగ్గరగా కేకలు వేయడంతో దొంగలు ఆమె సెల్‌ఫోన్ తీసుకుని గోడ దూకి పక్కింట్లోని రెండు మోటార్‌సైకిళ్లను సైతం దోచుకుని వాటిపై పారిపోయారు. తర్వాత తేరుకున్న సుభద్ర సెంటర్‌కు పరిగెత్తుకుంటూ వెళ్లి మరొకరి సెల్‌ఫోన్ తీసుకుని కుమారుడు రమేష్‌కు ఫోన్ చేయడంతో అతడు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన జరిగిన ప్రదేశానికి వచ్చి కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, దేవరపల్లి సీఐ నాయక్ పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేశామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. సుభద్ర ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో దుండగులు వచ్చిన దృశ్యాలు కనిపిస్తున్నాయని, వారి కోసం నాలుగు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు

పిఠాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియను కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-19పోటీలకు అర్హులైన క్రీడాకారుల ఎంపికకు గానూ పోటీలు జరిగాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఛైర్మన్ వియ్యపు రామన్నరాజు ప్రారంభించగా, ఫిజికల్ డైరెక్టర్ రత్నశామ్యూల్, టెక్నికల్ అఫిషియల్ పి.పద్మ, గోవింద్, పి.లక్ష్మణరావు, బి.కృష్ణార్జున, వంశీ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో డి.రామకృష్ణ, కె.చిన్నబ్బాయి, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన జట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19 బాలుర జట్టు సభ్యులుగా జశ్వంత్, జె.ప్రణీత్‌కుమార్, ఎం.నానిబాబు, బి.సుశాంత్, వి.హేమంత్, ఎం.రిషేంద్రవర్మ, బి.సోమరాజు, పి.నాని, కె.ప్రతీష్, ఎం.అనిల్‌కుమార్, కె.అచ్యుత్, డి.అఖిల్, డి.బంగారం, ఆర్.లోకేష్, దుర్గాసాయితేజ, వి.రాము ఎంపికయ్యారు. బాలికల జట్టు సభ్యులుగా పి.సంధ్య తేజశ్రీ, ఎం.కల్యాణి, జి.తేజస్విని, పి.దివ్య, పి.మహాలక్ష్మీ, పి.భవానీ, పీవీఎల్‌జీ భవానీ, కె.జాహ్నవిశ్రీ, భవ్యశ్రీ, సీహెచ్.అపర్ణ, ఎం.నవ్య, ఆర్.స్వర్ణప్రియ, డి.దుర్గాఅలేఖ్య, కె.హరిణి, ఎస్.శ్రీసత్య, జె.ప్రియాంక ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన పుల్లేటికుర్రు విద్యార్థులు

అంబాజీపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎ.వెంకట్రావు, పీడీ అంది సూర్యనారాయణ తెలిపారు. బాల్‌బాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. సీహెచ్.జ్యోతిసాయి పల్లవి, ఎ.రక్షిత బాల్‌బాడ్మింటన్, వాలీబాల్‌కు... జి.రమాఅషిత 1500 మీటర్ల పరుగుపోటీల్లో, సీహెచ్ హర్షవర్ధని, 3కేఎం, 4కేఎం పరుగు పోటీల్లో ఎం.తేజస్విని, దుర్గాశ్రీ ప్రథమస్థానం, మర్రి తేజస్వ 3కేఎంలో ప్రథమ స్థానం సాధించారు. కొప్పిశెట్టి మనోజ్ జూనియర్ అథ్లెటిక్స్ వవిభాగంలో ప్రతిభ కనబరిచాడు. అలాగే మర్రి తేజస్వ, సీహెచ్ హర్షవర్ధని ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. క్రీడాకారులకు తర్ఫీదును అందించిన పీడీ అంది సూర్యనారాయణ, పీఈటీ దొమ్మేటి ఉదయభాస్కర్‌ను సత్కరించారు.

శాస్త్రవేత్తల జాబితాలో జేఎన్టీయూకే ప్రొఫెసర్లు



ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు



ప్రొఫెసర్ బీటీ.కృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ప్రచురణ సంస్థ ఎల్సీ వీర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో 2025 సంవత్సరానికి గాను ప్రపంచ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో జేఎన్టీయూకే ప్రొఫెసర్లు స్థానాలు పొందారు. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగంలో ఎనర్జీ ఏఐ ఇమేజ్ ప్రాసెసింగ్ సబ్ కేటగిరీలో వారికి చోటు దక్కిందని ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈఈఈ విభాగం ప్రొఫెసర్, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావుకు 6,975వ స్థానం... ఈసీఈ విభాగం ప్రొఫెసర్ బీటీ.కృష్ణకు 8,584వ స్థానం లభించిందన్నారు. ఈ విధంగా చోటుదక్కడం జేఎన్టీయూకే చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. ఇద్దరు ప్రొఫెసర్లు 100కు పైగా జర్నల్స్‌లో పేపర్లు ప్రచురించారన్నారు. వారిని వీసీ ప్రసాద్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కొమ్మరి స్వర్ణకుమారి(45) ఈ నెల 18న తన ఇంటి డాబాపై ఆరవేసిన దుస్తుల తీస్తున్న సమయంలో డాబాకు ఆనుకుని విద్యుత్ వైర్లపై ఉన్న పక్షులు ఒక్కసారిగా ఎగరడంతో విద్యుత్‌వైర్లు కుమారికి తగిలి షాక్‌కు గురైంది. తీవ్రగాయాలైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

తాపీమేస్త్రికి గాయాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంముంగండ గ్రామదేవత శ్రీముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఒక ఇంటిపై పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు 11 కెవి విద్యుత్ తీగలు తగలి తాపీమేస్త్రీకి తీవ్ర గాయాలయ్యాయి. బోర్రా శ్రీనివాస్‌కు సంబంధించిన బిల్డింగ్ రెండో అంతస్తులో పోతవరం గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ గోసంగి శ్రీనివాస్ సిమెంట్ పనులు నిర్వహిస్తున్నాడు. ఇనుప ఊచలు వంచే సమయంలో అటుగా వెళ్లిన విద్యుత్ తీగల ద్వారా షాక్ తగిలింది. దీంతో శ్రీనివాస్ అక్కడ నుంచి కిందికి పడిపోవడంతో కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

గణన పద్ధతులపై అంతర్జాతీయ సెమినార్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గణన శక్తితో గణితం కలయిక మనం సమస్యలను సంప్రదించే విధానాన్ని మార్చివేసిందని నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణిత విభాగం ఆధ్వర్యంలో గణన పద్ధతులపై ఆన్లైన్ అంతర్జాతీయ సెమినార్ గురువారం జరిగింది. గణితంలో కంప్యూటేషనల్ టెక్నిక్‌ల ఇతివృత్తంగా జరిగిన ఈ సెమినార్‌లో వీసీ మాట్లాడుతూ భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్‌లో సంక్లిష్ట వ్యవస్థల మోడలింగ్ నుంచి గణిత పద్ధతులను ఉపయోగించి కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, క్రిప్టోగ్రఫీలో పెద్దఎత్తున డేటాను నిర్వహించడం వరకూ ఒక అనివార్య సాధనంగా మారిందని చెప్పారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ రెహనా నస్రీన్, వరంగల్ ఎన్ఐటీ నుంచి ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య హాజరై గణితంలో గణన పద్ధతులపై క్షుణ్ణంగా ప్రజంటేషన్ ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి ప్రిన్సిపాల్, పి.విజయనిర్మల, కన్వీనర్ టి.హైమావతి, కోకన్వీనర్లు కె.రేవతి, కేవీఎం వరకుమార్, శ్రీనివారావు, మల్లిప్రియ, అశోక్, గీత, సుజాత పాల్గొన్నారు.

దేవీచౌక్‌లో ప్రత్యేక పూజలు



దేవీచౌక్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శ్రీబాలాత్రిపుర సుందరి దేవి నాల్గోరోజు గురువారం శ్రీకాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ద్రాక్షారామలో...

ద్రాక్షారామ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జల ప్రహార్.. సైనికా జోహార్!

కాకినాడ తీరంలో ముగిసిన యుద్ధ విన్యాసాలు





కాకినాడ తీరంలో యుద్ధ విన్యాసాల దృశ్యాలు





సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ డీప్ సముద్రంలో భారత నౌకా దళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఉభయ చర వ్యాయామం (జల ప్రహార్-25) యుద్ధ విన్యాసాలు విజయవంతంగా ముగిసినట్టు అధి కారులు తెలిపారు. ఉమ్మడి సైనిక విన్యాసం, యుద్ధ సన్నదతను మరింత మెరుగుపరచడానికి ఈ విన్యాసాలను ఏటా భారత త్రివిధ దళాల ఆధ్వర్యంలో కాకినాడ సముద్ర తీరంలో నిర్వహిస్తున్నాయి. ద్వైవార్షిక ఉమ్మడి వ్యాయామం జల ప్రహార్‌ను భారత దేశ తూర్పు సముద్ర తీరంలో ఉభయచర కార్యకలాపాల్లో సెంటర్-సరీస్ సినర్జీ, కార్యాచరణ ప్రణాళిక అమలును ధృవీకరించడం, త్రివిధ దళాల సన్నద్ధతను మరింత మెరుగుపరచడం లక్ష్యంగా చేసుకుని సెప్టెంబరు 21-23 వరకు కాకినాడ సముద్ర మధ్యభాగంలో విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ ఘరియల్‌లోకి సైన్య దళాలను ప్రవేశ పెట్టడం, ఏకీకృతం చేయడం చేశారు. ఈ విన్యా సాల్లో భాగంగా ఆన్‌బోర్డు శిక్షణ, భద్రతా బ్రీఫింగ్‌లు, నావికుడి జీవితం వైపు దృష్టి సారించడం, క్రీడలు, స్నేహాన్ని పెంపొందించేందుకు ఈ ఉమ్మడి పరస్పర విన్యాసాలు ఎంతగానో దోహద పడతాయని అధికారులు తెలిపారు. విన్యాసాల్లో భాగంగా సముద్రతీరంలో హార్డ్ బీచింగ్, ఎన్‌సీల, బీఎంపీలను ప్రారంభించి, ఎస్ఓపీలు, ఉమ్మడి శిక్షణ అంతా ఒక పద్ధతిలో విన్యాసాలు నిర్వహిం చినట్లు త్రివిధ దళాల అధికారులు తెలిపారు. ఈ వ్యాయామం రెండు దశల్లో నిర్వహించగా, మొద టి దశలో ఈనెల 16నుంచి 20 వరకు విశాఖ ప ట్నంలో హార్బర్‌దశలో చేయడం జరిగిందన్నారు.

విజయదుర్గా పీఠంలో కుంకుమ పూజలు

రాయవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారు రజత కవచధారిగా పూజలందుకుంది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి కుంకుమ పూజలు జరిపారు. ఆధ్యాత్మికవేత్త బేతవోలు రామబ్రహ్మం రామాయణం విశిష్టత వివరించగా, గొర్తి సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారి అవతారాలు, రాక్షస సంహారాన్ని భక్తులకు తెలియజేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు జీవీఎస్‌వీ కామేశ్వరి, భాస్కరనారాయణ తదితరులున్నారు.

చీరమేను వచ్చేసింది...

యానాం మార్కెట్‌లో సందడి



యానాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన యానాం మార్కెట్‌లోకి చీరమేను వచ్చేసింది. యానాం, గోదావరి జిల్లావాసులు ఎంతో ఇష్టంగా తినే చీరమేను శీతకాలం ప్రారంభంలోను, ఎక్కువగా దీపావళి ముందుగా దొరుకుంది. ముఖ్యంగా తూర్పుగాలు సమయంలో ఈ చీరమేను మత్స్యకారులకు దొరుకుతుంది. ఈ చేపలు చాలా చిన్నగా వేళ్ల సందులు, వలలోంచి జారిపోయేంత చిన్నగా ఉండడంతో గతంలో చీరలతో మాత్రమే పట్టేవారు. తర్వాత చిన్నచిన్న వలలతో వాటిని పట్టుకుంటున్నారు. ప్రస్తుతం తూర్పుగాలులు వీస్తుండటంతో గత 2 రోజులుగా యానాం మార్కెట్‌లోకి సూమరు ఐదు క్యారేజీల చీరమేను వచ్చింది. ప్రస్తుతం సేరు రూ.1500 నుంచి 2000 వరకు ధర పలికింది. వీటితో అనేక రకాల వంటలు చేసుకోవచ్చు. ఇకపై అడపదడపా దీపావళి వరకు చీరమేను దొరకనుంది.

కాకినాడ

దుర్గమ్మ సన్నిధికి భవానీ భక్తుడి పాదయాత్ర

కరప, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.బావారం గ్రామానికి చెందిన యు.లోవరాజు అనే భవానీ భక్తుడు గురువారం ఉదయం పాద యాత్రగా విజయవాడ కనకదుర్గమ్మ తల్లి గుడికి పయనమయ్యాడు. ఆయన్ను సహచర భవానీ భక్తులు అభినందించి సాదర వీడ్కోలు పలికారు.


డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ నిర్వహిస్తున్న డాక్టర్ నాయక్ బృందం


జీజీహెచ్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి బృందం


కాకినాడ కార్పొరేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న కమిషనరు భావన

మన ఆరోగ్యం... మన చేతుల్లోనే

» 'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, తద్వారా సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీఎల్‌ఏటీవో డాక్టర్ చలమయ్య, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్, డీపీఎంవో డాక్టర్ జి.లక్ష్మి, ఇన్‌చార్జి డీఎంవో డాక్టర్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు. జీజీహెచ్‌లో సూపరిటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆధ్వర్యంలో మొక్కలు నాటి ఆసుపత్రి పరిసరాలను శుభ్రపరిచారు. అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వి.వరప్రసాద్, న్యూరాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ షరీఫ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనాకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హి సేవ ప్రచారం కింద ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు, పరిశుభ్రత కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సురేష్‌నగర్ మూడో డివిజన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనరు భావన పార్కులో చెత్తను ఊడ్చారు. అనంతరం మొక్కలు నాటి ప్రజలతో పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, ఉప కమిషనరు కె.శ్రీనివాసరావు, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ అఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ కేవీ కృష్ణారావు, శానిటేషన్ సూపర్‌వైజరు అప్పలనాయుడు, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాసరావు పేర్కొన్నారు. కరపలో అధికారులు, నాయకులతో కలిసి నిర్వహించిన 'ఏక్ దిన్-ఏక్ ఘంట-ఏక్ సాథ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అందరితో కలిసి శ్రమదానం చేసి రహదారిపై చెత్త, చెదారం, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో రాయి ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వీవీఎస్ వర్ధన్, పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, నాయకులు ముద్రగడ రమేష్, సైనవరపు భవానీశంకర్, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యాళ్ల పండు, పేకేటి దుర్గాప్రసాద్, పవన్‌కుమార్, నక్కా బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హి సేవలో భాగంగా గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను ఎంపీడీవో సెలట్‌రాజు, ఈవోపీఆర్డీ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది తొలగించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు రోడ్లను శుభ్రపరిచారు. కమిషనరు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కోరింగ సర్పంచ్ పెయ్యల మంగేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మరిడమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన సభలో పారిశుధ్య కార్మికుల సేవలను పలువురు ప్రశంసించి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, బీసీసెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, ఎంపీడీవో లక్ష్మణరావు, ఏవో సత్యనారాయణ, కార్యదర్శి వీజేవీ రమణ, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కరప బజారు సెంటర్లో వ్యర్థాలు సేకరిస్తున్న అధికారులు, నాయకులు


గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది


కాకినాడ కార్పొరేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, కమిషనరు భావన


ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

దివ్యాంగుడి ఇంటి నిర్మాణానికి 'లయన్స్' శ్రీకారం

తాళ్లరేవు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జెల్లావారిపేటకు చెందిన దివ్యాంగుడు నేరేడిమిల్లి ఏడుకొండలు ఉండేందుకు ఎటువంటి ఆధారం లేదు. దీంతో తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆర్థిక సహకారంతో గురువారం ఇంటి నిర్మాణానికి సభ్యులు శంకుస్థాపన చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు మాట్లాడుతూ వెనుక ముందూ ఎవరూ లేని నిరుపేదలకు లయన్స్ క్లబ్ బ్రహ్మార్పణం (క్యారేజీ భోజనాలు) కార్యక్రమం వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా దివ్యాంగుడు ఏడుకొండలుకు గృహ నిర్మాణం చేపట్టామన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నడింపల్లి వినోద్, నున్న దత్తు, సామా భగవాన్, చోడే శ్రీనివాస్‌మాలతి, కట్టా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


గణేష్‌కు రూ.10వేల నగదు అందిస్తున్న సతీష్, సత్యనారాయణ

వ్యాధిగ్రస్తుడికి రూ.10వేలు ఆర్థిక సాయం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరం శివారు భావనారాయణపురం గాంధీనగర్‌కు చెందిన రాయుడు గణేష్ పెయింటింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న అతడికి వైద్య ఖర్చుల కోసం రాయల్ శెట్టిబలిజ కమ్యూనిటీ సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేలు నగదును ప్రతినిధులు పాలిక సతీష్, అనుబోయిన సత్యనారాయణ గురువారం అందించారు. పంపన మహేష్, కాళ్ల శ్రీను, పిల్లి విజయ్‌గోపాల్, పెంకే సత్యనారాయణ, పెంకే రామకృష్ణ, మేడిశెట్టి వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి


కాకినాడలో దీన్‌దయాళ్ జయంతి సభలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నగరంలోని గాంధీనగర్ క్షత్రియ పరిషత్‌లో బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన చీకురుపాటి కుమారస్వామి, బోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ కోసం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు, ఆయన సిద్ధాంతాలను వివరించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, యెనిమిరెడ్డి మాలకొండయ్య, యార్లగడ్డ రామ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ గౌతు చిన్న, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల కృష్ణవర్మ, చోడిశెట్టి రమేష్‌బాబు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): పెనుగుదురులో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గోవింద్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పుట్టా వీరప్రసాద్ గాంధీ, వెంపల లక్ష్మణరావు, నాగేశ్వరరావు, ప్రసాద్, వీరబాబు, ముమ్మిడి పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ గైగోలుపాడులో బీజేపీ మండల కార్యదర్శి పాలిక శివ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాదంతో నిరాడంబర జీవితం గడిపిన అభ్యుదయవాది దీన్‌దయాళ్ అన్నారు. స్వచ్ఛ భారత్ నిర్వహించి శ్రమదానం చేశారు. నాయకులు రామకృష్ణ, పాలిక శివ, బి.అజయ్, కండిల్లి వెంకట్, లోవరాజు, వీరబాబు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా పక్వాడా ఇన్‌చార్జి కర్నీడి తాతీలు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, సైతన సత్యకుమారి, అల్లిబోయిన నందకిషోర్, పార్థసారధి, పసుపులేటి సత్యనారాయణ, అల్లుబోయిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్/గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం కందరాడలో దీన్‌దయాళ్ చిత్రపటానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి కొండలరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొల్లప్రోలులో దీన్‌దయాళ్ చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు పూలమాల వేసి పార్టీ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాళ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నేత చెరుకూరి రవికృష్ణ కోరారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నేత శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ చిత్రపటానికి బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పంపన శేషగిరి ఆధ్వర్యంలో కార్యకర్తలు నివాళులర్పించారు. గ్రామస్తులకు, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు మేడసాని వరలక్ష్మీనారాయణ, జె.గౌరీశంకర్, కొమ్మిరెడ్డి భద్రరావు, కడియాల రామానుజన్, అనుసూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


దుర్గాడలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

పత్తి పంటను ఆశించిన టబాకో స్ట్రీక్ వైరస్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ, చేబ్రోలు తదితర గ్రామాల్లోని పత్తి పంటపై టబాకో స్ట్రీక్ వైరస్ ఆశించినట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గుర్తించారు. గురువారం వారు పంట పొలాలను పరిశీలించారు. వయ్యారి భామ కలుపుమొక్క పుప్పొడి నుంచి వైరస్ ఆశిస్తుందని, తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మొక్కకు వైరస్ ఆశించినట్టు గుర్తించగానే కొమ్మల చివరలు తుంచి తామర పురుగు నివారణకు పిప్రొనిల్ 400 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 60 గ్రాములు లేదా ఎసిఫేట్ 300 గ్రాములు లేదా దయామిథోక్సాం 40 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీఎన్ శర్మ సూచించారు. గట్లపై వయ్యారి భామ మొక్కలు లేకుండా చూడాలన్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆనందోత్సాహాలు



డీఎస్సీ విజేతలతో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు

సామర్లకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'కాకినాడ జిల్లా ప్రజల కోసం సానా సతీష్ ఫౌండేషన్ చేస్తున్న ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి... చైర్మన్, నా మిత్రుడు తలాటం హరీష్ కృషితో జిల్లా లైబ్రరీ ద్వారా అనేక మంది విద్యార్థులకు విలువైన పుస్తకాలు, ఇతర వనరులు అందించగలిగాము... డీఎస్సీలో 16 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడమే అందుకు నిదర్శనం' అని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు తెలిపారు. డీఎస్సీ విజేతలకు గురువారం అమరావతిలో నియామక పత్రాలు అందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి ఆ 16 మందీ టీచర్లుగా ఉత్తర్వులు అందుకోవడం పట్ల ఎంపీ సతీష్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వివరాలను కొప్పవరంలోని ఎంపీ కార్యాలయ ఇన్చార్జి మేకా లక్ష్మణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రిని కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామిని, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిలను ఎస్సీ కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు గురువారం అమరావతిలో కలిశారు. వారి సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రఘు, సెక్రటరీ ఆర్డీ ప్రసాద్, ట్రెజరర్ మధు, సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో తిరుమలలో అక్రమాలపై కూటమి నేతల నిరసన

సామర్లకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో అరాచకాలు, అక్రమాలు, అవినీతి చర్యలను నిరసిస్తూ టీడీపీ, జనసేన కార్యకర్తలు మఠం సెంటరు వద్ద ఆందోళన చేపట్టారు. నాటి మహా పాపంలో పాలుపంచుకున్న వైసీపీ నాయకుల ఫొటోలను గోడలపై అతికించి విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు, అందుగుల జార్జి చక్రవర్తి, గొలితి సత్యనారాయణ, గోపాలకృష్ణ, మలిరెడ్డి ప్రసాద్, వల్లూరి దొరబాబు, మెండెం సత్రయ్య, జనసేన నాయకులు మందపల్లి చినబాబు, తుమ్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థ నీటియాజమాన్యంతో అధిక దిగుబడులు

శంఖవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరిలో సమర్థ నీటియాజమాన్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. గురువారం రైతులకు వరిలో చీడపీడలు, సూక్ష్మపోషకాల లోపాలపై వివరించారు. వరినాట్లు వేసిన 20రోజుల తర్వాత పొలంలో పలుచటి నీటిమట్టాన్ని ద్వారా 15 నుంచి 30శాతం ఆదా చేయవచ్చన్నారు. శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మోతుగూడెంలో సీఆర్పీఎఫ్ జవాన్ల స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న జవాన్లు

మోతుగూడెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం సీఆర్పీఎఫ్ జవాన్ల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. దీనికి సీఆర్పీఎఫ్ ఏ/42 బెటాలియన్ ఇన్స్‌పెక్టర్ వెంకటేష్ హాజరై మాట్లాడుతూ పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉంటామన్నారు.అలాగే చెక్‌పోస్ట్, లక్ష్మీగణపతి ఆలయం నాలుగు రోడ్ల కూడలి వద్ద జవాన్లంతా కలిసి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో సివిల్ పోలీసులు ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, పోలీస్ సన్నీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరంలో బోనాల జాతర


ఊరేగింపులో మహిళలు, చిన్నారులు

వై.రామవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్న వరాత్రుల్లో భాగంగా గురువారం వై.రామవరంలో మహిళలు బోనాల జాతరను నిర్వహించారు. చాకలి వీధిలోని దుర్గమ్మ ఆలయ నిర్వాహకులు ఆధ్వర్యంలో జరిగింది. గ్రామంలోని వాల్మీకి వీధుల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు బోనమెత్తుకుని పలువీధుల్లో ఊరేగిస్తూ అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచి ఉపవాసాలతో బతుకమ్మను కొలిచి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి


దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో గురువారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని మండలాధ్యక్షుడు చోళ విశ్వరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు చోళ చిలికారెడ్డి, చోళ్ల రాణి, తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయనీదేవిగా అమ్మవారు



వీఆర్‌పురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. స్థానిక ఇందిరా సెంటర్‌లోని విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో శరన్నవరాత్రులు వేడుకలగా జరుగుతున్నాయి. భక్తుల సమక్షంలో ఆలయ అర్చకుడు మల్లాది శేఖర్ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ


వస్తువులు అందజేస్తున్న సభ్యులు

కూనవరం, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయ్ భాస్కర్ కాలనీ వాసులకు ఖమ్మం మేత్ర సన సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు ఈ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారికి సహాయం అందించేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది. కందిపప్పు, నూనె, బియ్యం, దుప్పట్లు, చిన్నపిల్లలకు బిస్కెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ దామాల సురేష్ సిస్టినా, ప్రేమ్ కుమార్, కొమ్మాని సునీత, తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్


వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. డాక్టర్ బీ. ఉదయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ నిఖిల్, డాక్టర్ అబిజ్ఞ, బీజేపీ మండల కన్వీనర్ లక్ష్మణ్, బీజేపీ మండల సెక్రెటరీ సుప్రియ, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బలంగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్, ఎంపీహెచ్‌ఈవో, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా తుప్పల తొలగింపు


తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

వై.రామవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జంగిల్ క్లియరెన్స్ పనుల్లో భాగంగా గురువారం యర్రంరెడ్డిపాలెం పంచాయితీ పరిధిలోని మునసలపాలెం, బొడ్డపల్లి రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. పంచాయతీ కార్యదర్శి పి.రాహుల్ సత్యానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

శరన్నవరాత్రి ఉత్సవాలతో ఆధ్యాత్మిక సందడి

- కాత్యాయనీదేవిగా దుర్గాదేవి అమ్మవారు
- నాల్గోరోజుకు దేవీనవరాత్రి ఉత్సవాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి ఉంటుందని ప్రత్తిపాడు తహశీల్దార్ ఎం. సూర్యప్రభ చెప్పారు. మండలంలోని ఏలూరులో మహిళలకు గురువారం దాడిశెట్టి అనంత బాబ్జిసమకూర్చిన పసుపు, కుంకుమ చీరలను తహశీల్దార్ పంపిణీ చేశారు. బోనాల ప్రదర్శన నిర్వహించారు. సర్పంచ్ రొంగల సత్యనారాయణ, గ్రామపెద్దలు కొట్టేటి రాయుడు, జాన్ మాణిక్యం, అడ్డాల త్రిమూర్తులు, కొట్టేటి అబ్బులు, గాది చిన్న, ఉంగ రాల శివ, డిప్యూటీ తహశీల్దార్ పుణ్యవతి, ఎంపీ టీసీ దాడిశెట్టి రాణి చక్రధర్, దాడిశెట్టి నూకాపతి, డి.అనంత బాబ్జి పాల్గొన్నారు. రాచపల్లిలోని అపీత కుచాంబ అమ్మవారిని కాత్యాయినిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ధర్మవరంలో బోనాల ప్రదర్శన

మండలంలోని ధర్మవరం గ్రామంలో గురువారం బోనాల ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ వందలాదిగా తరలివచ్చి కలశాలతో కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి ప్రధాన రహదారి మీదుగా వీధుల్లో ఊరేగించారు.

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి):శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారు కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని బత్తాయిలతో అలంకరించారు. మహిళా భక్తులు సహస్ర నామం ఆలపించారు. రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారినిశంఖవరం ఎంపీపీ పర్వత రాజుబాబు, వివేక్ దర్శించుకున్నారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): నెహ్రూ కాలనీలోని శ్రీ లక్ష్మిగణపతి దేవస్థానంలో కొలువైన శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ సెంటర్‌లో లలితా భువనేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరణ చేశారు.

'శ్రీ ప్రకాష్'లో దసరా ఉత్సవాలు

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారికి లలిత సహస్త్రనామ పారాయణం చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. కోలాటం,బతుకమ్మ, దాండియా, భరతనాట్యం వంటి సాంస్కృతిక నృత్యకార్యక్రమాలు నిర్వహించారు. కళా శాల ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాత్యాయనీదేవిగా తలుపులమ్మ

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


జగ్గంపేటలో అన్నపూర్ణాదేవి...రౌతులపూడిలో కాత్యాయనీదేవి


కాత్యాయనీదేవిగా తలుపులమ్మ అమ్మవారు


దసరా వేడుకల్లో అలరిస్తున్న శ్రీ ప్రకాష్ విద్యార్థులు


ఏలూరులో కుంకుమ, చీరలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సూర్యప్రభ


ధర్మవరంలో బోనాల జాతర ప్రదర్శన దృశ్యం


తొండంగిలో అన్నపూర్ణాదేవి


భవానీ భక్తులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం


రాచపల్లిలో అపీత కుచాంబ అమ్మవారు


ఏలేశ్వరంలో కాత్యాయనీదేవిగా

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లింగవరం కాలనీ, సంతోషిమాత ఆలయాలవద్ద అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో జేవీఆర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు రాఘవమ్మ, కౌన్సిలర్ మూది నారాయణస్వామి పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

తొండంగి(ఆంధ్రజ్యోతి): ఏవీ నగరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో కొలువైన అమ్మవారు గురువారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.అర్చకులు చరణ్ శర్మ, మిశ్రాలు పూజలు నిర్వహించారు. టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భవానీ భక్తులకు ఆతిథ్యం

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట చెందిన భారతీయ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి 8 ఏళ్లనుంచి కాలినడకన వెళ్లే భవానీ భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారంతో పాటు విశ్రాంతి తీసుకోవడానికి తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. భవాని భక్తులే కాకుండా సంవత్సరం పొడవునా కాలినడకన తీర్థయాత్రలకు వెళ్లే వారికి గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారున మోహన్ సాయి కృష్ణ రెసిడెన్సీ వద్ద ఇస్తామని నాగేంద్ర చౌదరి పేర్కొన్నారు.

'ఆదిత్య'లో ఫార్మాసిస్ట్స్ డే వేడుకలు

గండేపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలల్లో వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కాకినాడ అర్బన్ డ్రగ్ ఇన్ స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ డ్రగ్ ఇన్ స్పెక్టర్ కావడానికి పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ప్రభుత్వ రంగంలో లభించే వివిధ ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు వివరించారు. వివిధ సెమిస్టర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 3 రోజుల పాటు యూసర్ ఇంటర్ పేస్ డిజైన్ యూజింగ్ ఫ్లటర్ అనే వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లి గ్రామానికి, నాయకంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నాయకంపల్లి, ఎల్లమెల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈటి వీరభద్రరావు గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

పండిట్ దీనదయాళ్ జయంతి


పండిట్ దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయం వద్ద పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ 109వ జయంతి వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు, కిర్లంపూడి మండలా ధ్యక్షుడు శరకణం రాజబాబు, కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి దేవర రామకృష్ణయాదవ్, కట్టా కాశీ విశ్వనాథ్, కొండి సత్తిబాబు, మూరా కృపారాయ్, పి. సత్యనారాయణ, కె కుశలవుడు, యతిరాజులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో...

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు శరకణం రాజాబాబు ఆధ్వర్యంలో దీన్ దయాళ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కిర్లంపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్రూట్స్ పంచారు. బీజేపీ నాయకులు కంట కాశీ విశ్వనాధం ఐవివి సత్యనారాయణమూర్తి, బుద్ధ పెద్దకాపు, పెంటకోట సత్యనారాయణ, కోనేటి శ్రీనివాసరావు, సింగలిదేవి సత్తిరాజు, మారిశెట్టి త్రిమూర్తులు శరణం కన్నారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజపూడి వైద్యాధికారి డాక్టర్ పూజ

మహిళలకు అవగాహన

జగ్గంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మామిడాడలో గురువారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రాజపూడి వైద్యాధికారి ఎన్.పూజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలకు అందించే వైద్య సేవలపై అవగాహన కల్పించారు. మహిళలు తీసుకోవలసిన పౌష్టికాహారంపై సీడీపీవో పూర్ణిమ తెలిపారు. ఈ సందర్భంగా 150 మంది వరకు రక్త, వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సూర్యకుమారి శ్రీనివాస్, ఎంపీటీసీ వేగి రత్నంరామకృష్ణ, గ్రామపెద్దలు బొడ్డేటి సుమన్, పెంటకోట సత్తిబాబు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ తీసుకోవాలని లోవ దేవస్థానం మాజీ చైర్మన్ గాడి రాజుబాబు అన్నారు. కెఎమల్లవరం గ్రామంలో గురువారం స్వస్థనారీ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు దృష్టిసారించాలని ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, సర్పంచ్ గొనగాల అప్పలరాజు కోరారు. మండలంలోని గజ్జనపూడిలో ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ మంగారత్నం మాట్లాడారు. కూటమి నాయకుడు దాకారపు కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు ఎ.అప్పల నర్స, పార్వతి, లోవ లక్ష్మి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

తుని రూరల్, (ఆంధ్రజ్యోతి): తేటగుంటలో గురువారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, వైద్య సిబ్బంది, నాయకుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. తుని ఎంపీపీ బొప్పన రాము, ఎంపీడీవో సాయి నవీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, కాకినాడ డీఎల్పీవో శ్యామల, తేటగుంట సొసైటీ ప్రెసిడెంట్ పేరూరి కృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి చేయాలి

కోటనందూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలను శుభ్రతగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో వెంకట నారాయణ తెలిపారు. గురువారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా జగన్నాథపురంలో టీడీపీ సీనియర్ నేత మాతిరెడ్డి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గొర్లి అచ్చియ్యనాయుడు, మాతిరెడ్డి బాబులు, గుడివాడ శ్రీను, గుడివాడ నాని, తహసీల్దార్ పీవీవీ సత్యనారాయణ, రాజ్‌గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడిలో స్వచ్ఛతా ఉత్సవ్

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఆసుపత్రి డీడీవో ఉమామహేశ్వరరెడ్డి అధ్వర్యంలో స్వచ్ఛత ఉత్సవ్ నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణను వైద్యులు, సిబ్బంది శుభ్రం చేశారు. శుభ్రత వల్ల కలిగి ఆరోగ్య ప్రయోజనాలను రోగులకు వారు తెలిపారు.

పేరవరంలో తాటాకిల్లు దగ్ధం

ఏలేశ్వరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేరవరంలో వేమగిరి చక్రమ్మ కుటుంబీకులుంటున్న తాటాకిల్లు విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్టు స్థానికులన్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయగా, ఇంట్లోని సామగ్రి, వస్తువులు కాలిపోయాయి.

ఎమ్మెల్యే దివ్య చిత్రపటానికి పాలాభిషేకం

తొండంగి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రావికంపాడులో ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలంటూ తుని ఎమ్మెల్యే యనమల దివ్య అసెంబ్లీలో కోరిన నేపథ్యంలో ఆమె చిత్రపటానికి పూర్వ విద్యార్థులు పాలాభిషేకం చేశారు. గురువారం పాఠశాల ఆవరణలో దివ్య చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీ ఆవరణలో శ్రమదానం

గండేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని సీహెచ్‌సీలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు పోతుల మోహన్ రావు బొల్లంరెడ్డి రామకృష్ణ రెడ్డి, ఎంపీడీవో కె.హరీకృష్ణ సత్యరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐ.ఎన్ శ్రీనివాసు, పరిపాలన అధికారి కె.చంద్రరావు, పంచాయతీ సెక్రటరీ వి.ఫణీంద్ర కుమార్, ఏపీఎం సన్యాసిరావు, సచివాలయ, పీహెచ్‌సీ సిబ్బంది శ్రమదానం చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికుడు వెంకన్నను సత్కరించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

శంఖవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని పెద్దాపురం డీఎల్‌పీవో బాలామణి అన్నారు. గురువారం కత్తిపూడిలో ఆమె పర్యటించి తడి,చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

కిర్లంపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ రోజుకి ఒక గంట సమయం కేటాయించాలని కిర్లంపూడి ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యప్రసాద్ కోరారు. ఏక్ అవర్ ఏక్ దిన్ ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా ఆయా పంచాయతీల్లో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు శ్రమదాన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్టీఆర్ రమేష్ బాబు, చదరం చంటిబాబు, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చిన్నబాబు, టీడీపీ నాయకులు తూము కుమార్, కాళ్ళ వెంకటేష్, గుడాల రాంబాబు పాల్గొన్నారు.